

పుడమి నుదుట శ్వేత వర్ణం

పంట సాగులో కలుపు మొక్కల నియంత్రణ, ప్రతి మొక్కకు నీటి తడులు అందడం, తెగుళ్ల నివారణకు అన్నదాత నూతన విధానాల వైపు మళ్లుతున్నారు. మల్హర్ మండలం గాధంపల్లిలో మల్చింగ్ పద్ధతిలో సాగైన మిర్చి పంట పుడమి నుదుట శ్వేత వర్ణం అద్దినట్లు కనువిందు చేస్తోంది. –న్యూస్‌టుడే, మల్హర్

కూష్మాండ...భక్తులకు అండ



శుభానంద దేవి

కాళేశ్వర దేవస్థానంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. నాలుగో రోజున ఇద్దరమ్మలు కూష్మాండ అలంకరణలో దర్శనమిచ్చి భక్తులకు ఆశీస్సులందజేశారు. న్యూస్‌టుడే, కాళేశ్వరం



సరస్వతీ దేవి

భద్రకాళి.. బంగారు తల్లి



స్వర్ణ కిరీటం, జుటామకుటాలు, కర్ణ పత్రాలు

దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ ఇంద్రకీలాద్రిగా పేరుగాంచిన ఓరుగల్లు శ్రీభద్రకాళి అమ్మవారు బంగారు ఆభరణాలతో దివ్య తేజస్సుతో భక్తులకు దర్శనమిస్తున్నారు. అమ్మవారికి ప్రభుత్వం బహూకరించిన స్వర్ణ కిరీటం, జుటా మకుటాలు, కర్ణ పత్రాలతో పాటు భక్తులు సమర్పించిన కానుకలు అనేకం ఉన్నాయి. పసిడి కాంతులతో దర్శనమిస్తున్న భద్రకాళి మాతను చూసి భక్తులు పులకించిపోతున్నారు.

● శ్రీదేవి శరన్నవరాత్రుల్లో రాష్ట్ర ప్రభుత్వం బహూకరించిన స్వర్ణ కిరీటం, జటా మకుటాలు, కర్ణ పత్రాలు అమ్మవారికి అలంకరిస్తారు. శ్రీభద్రకాళి భద్రేశ్వరుల కల్యాణ బ్రాహ్మోత్సవాల్లో కొన్ని ఆభరణాలు అలంకరిస్తారు.

అమ్మవారి ఆభరణాలు ఇవే..

● బంగారు స్వర్ణ కిరీటం: 4 కిలోల 70 గ్రాముల 088 మిల్లీగ్రాములు ● కర్ణ పత్రము- 1 కిలో 202 గ్రాముల 004 మి.గ్రా ● కర్ణ పత్రము-1 కిలో 149 గ్రాముల 022 మి.గ్రా ● జటా మకుటం- 2 కిలో 273 గ్రాము 013 మి.గ్రా. ● జటా మకుటం 2 కిలోల 368 గ్రాముల 040 మి.గ్రా. ● తెల్లరాళ్లతో ముక్కు పోగు పెద్దది: 104 గ్రా. ● చంద్ర వంక బొట్టు: 65 గ్రా 300 మి.గ్రా. (124 చిన్న ఎరుపు రాళ్లు, 01 పెద్ద ఎరుపు రాయి) ● ఒక ఎర్ర రాళ్ల బంగారు గాజు 340 గ్రా. ● ఒక ఎరుపు రాయి ముక్కు పోగు 10 గ్రా. ● అష్టలక్ష్మి చెంబు 605 గ్రా 600 మి.గ్రా ● ఒక రాళ్ల ముక్కు పోగు 19 గ్రా 950 మి.గ్రా ● ఒక తెల్ల రాళ్ల ముక్కు పోగు 21 ముత్యాలు, ఒక ఎర్ర పూస, 13.600 మి.గ్రా ● లక్ష్మి కాసుల నెక్లేస్ 20 గ్రా .570 మి.గ్రా ● లక్ష్మి కాసుల పేరు 21గ్రా. 300 మి.గ్రా. ● 2 బంగారు గాజులు 16 గ్రా. 220 మి.గ్రా ● లక్ష్మి రూపంతో ఉన్న పచ్చల కెంపుల హారం 086- 730 మి.గ్రా ● అమ్మవారి రెండు పెద్ద పుస్తెలు, తాడు, రెండు గొట్టాలు, రాగి తీగతో కలిపి 192 గ్రా. ● పెద్ద ముక్కెర రాళ్లతో 44 గ్రా. ● అమ్మవారి పెద్ద మాంగల్య సూత్రం, తాడు, బంగారు గొట్టాలు, బంగారు గుండ్లు 130 గ్రా. ● కాసుల పేరు, రాళ్ల ముక్కు పోగు 262 గ్రా. ● ఒక ముక్కు పోగు 18గ్రా 850 మి.గ్రా.

–న్యూస్‌టుడే, రంగంపేట

బ్యాంకు లాకర్‌లోనే..: రాష్ట్ర ప్రభుత్వం బహూకరించిన స్వర్ణ కిరీటం, జుటా మకుటాలు, కర్ణ పత్రాలు, భక్తులు, దాతలు ఇచ్చిన బంగారు ఆభరణాలన్నీ హనుమకొండలోని బ్యాంకు లాకర్‌లో భద్ర పరుస్తారు. రోజు వారీగా అలంకరించే ఆభరణాలు దేవస్థానంలో ఉంటాయి.



కాసుల పేరు హారం, లక్ష్మి కాసుల హారం, బంగారు గాజులు, రెండు పెద్ద గాజులు, అష్టలక్ష్మి బంగారు చెంబు, పెద్ద మాంగల్యం, పెద్ద పుస్తెలు, పచ్చల హారం, చంద్ర వంక, ముక్కు పుడక, ముక్కు పోగు

ఆర్‌ఎస్సెస్ వందేళ్ల వేడుకలు

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: వరంగల్ కాశీబుగ్గ వివేకానంద కళాశాల వేదికగా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్ఎస్సెస్) వందేళ్ల వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆర్ఎస్సెస్ కాశీబుగ్గ నగరశాఖ ఆధ్వర్యంలో కార్యకర్తలు తొలుత కాశీబుగ్గ పుర వీధుల్లో కవాతు చేశారు. అనంతరం వివేకానంద కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా ఎన్ఐటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.ఖానాపురం ఉదయ్‌కుమార్ హాజరై ఆర్ఎస్సెస్ ఆవిర్భావం గురించి వివరించారు.

నేడు సింగరేణి క్వార్టర్ల కేటాయింపు

భూపాలపల్లి, న్యూస్‌టుడే: భూపాలపల్లి ఏరియాలోని సింగరేణి క్వార్టర్స్ కేటాయింపులు సోమవారం జరగనున్న నేపథ్యంలో పొరపాట్లకు ఆస్కారం లేకుండా పారదర్శకంగా చేపట్టాలని తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామెర గట్టయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నేడు నిర్వహించే క్వార్టర్ల కేటాయింపులను కొన్ని కార్మిక సంఘాల నాయకులు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని, అది సరైన పద్ధతి కాదన్నారు. సీనియారిటీ ప్రకారం అందించాల్సిన క్వార్టర్లను కొంత మంది ప్రయోజనాల కోసం జూనియర్లకు అందిస్తున్నారని ఎలాంటి అవినీతికి తావు లేకుండా కేటాయింపులు చేపట్టాలన్నారు.



బతుకమ్మను ఎత్తుకున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు దంపతులు

పూలను పూజించే పండగ బతుకమ్మ

భూపాలపల్లి రూరల్, న్యూస్‌టుడే: పూలను పూజించి దేవతలను కొలిచే పండగ బతుకమ్మ అని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పద్మ దంపతులు హాజరై బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు. కాగా ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ. 10.97 లక్షల విలువ చెక్కులను 48 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు.

౯౦ శాతం సన్నాలే సాగు..!

ధాన్యం కొనుగోలుకు యంత్రాంగం సన్నద్ధం

ఉమ్మడి వరంగల్‌వ్యాప్తంగా వానాకాలం ధాన్యం సేకరణకు అధికారయంత్రాంగం సన్నద్ధమవుతోంది. ఇప్పటికే కొనుగోలు కేంద్రాల సంఖ్య, లక్ష్యాన్ని ప్రకటించింది. మరో 25 రోజుల్లో వరికోతలు ప్రారంభం కానుండడంతో అధికారులు ఇప్పటి నుంచే ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ప్రభుత్వం సన్నాలకు రూ.500 బోనస్ ఇవ్వనున్న నేపథ్యంలో వాటి సేకరణలో ఎలాంటి అవకతవకలు జరగకుండా జాగ్రత్తలపై దృష్టిసారించారు.

–ఈనాడు, మహబూబాబాద్

'ఉమ్మడి వరంగల్‌లో ఈ వానాకాలంలో వ్యవసాయశాఖ అంచనాల ప్రకారం 9,02,233 ఎకరాల్లో వరి సాగవుతోంది. క్వింటాకు రూ. 500 చొప్పున బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో సన్నాల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. మొత్తం సాగులో 90 శాతం వరకు ఇవే ఉంటాయని వ్యవసాయశాఖ అంచనా వేసింది. దీని ప్రకారం 10 శాతమే దొడ్డు రకాల సాగైనట్లు లెక్క.'



ధాన్యం ధరలు

☛ ఏ గ్రేడ్ రకం (క్వి. రూ.): 2320

☛ సాధారణ రకం (క్వి.రూ.): 2300

జిల్లాల వారీగా ధాన్యం కొనుగోలు కేంద్రాల వివరాలు

మహబూబాబాద్	234	2,88,000
వరంగల్	203	2,40,000
భూపాలపల్లి	189	2,00,000
జనగామ	180	2,00,000
ములుగు	173	1,50,000
హనుమకొండ	149	1,50,000

● ధాన్యం కేంద్రాల సంఖ్య
● ధాన్యం సేకరణ లక్ష్యం(టన్నుల్లో)

ఇదీ లెక్క..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,128 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 12.28 లక్షల టన్నుల ధాన్యాన్ని సేకరించాలని పౌరసరఫరాలశాఖ అధికారులు నిర్దేశించుకున్నారు. అత్యధికంగా మహబూబాబాద్, అత్యల్పంగా హనుమకొండ, ములుగు జిల్లాలో సేకరణ లక్ష్యం ఉంది. 12.28 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలుకు 3.07 కోట్ల గన్నీ సంచులు అవసరం. అకాల వర్షం వస్తే నష్టం జరగకుండా టార్పాలిన్ పరదాలు అవసరం. ఇందుకు దాదాపు 35 వేల పరదాలు సిద్ధం చేసుకుంటున్నారు.

ఏఈవోలే కీలకం

ధాన్యంలో తేమశాతం, నిబంధనల ప్రకారం సన్నాల నిర్ధారణ చేసి టోకెన్లు జారీ చేయడంలో వ్యవసాయ విస్తర్ణాధికారులు(ఏఈవో) కీలకం. బోనస్ వర్తించే 33 రకాల సన్నాల గుర్తింపులో తగిన జాగ్రత్తలు పాటించాలి. సన్నధాన్యం గుర్తింపు కోసం గ్రెయిన్ కాలిపర్ (డయల్ మైక్రోమీటర్)ను ఉపయోగించనున్నారు. ఈ యంత్రం గింజ పొడవు, వెడల్పు కొలుస్తారు. నిర్దేశిత ప్రమాణాల మేరకు ఉంటేనే కొనుగోలు చేస్తారు.

ఇలా గుర్తిస్తారు..

ప్రతి గ్రామంలో సన్నాలకు, దొడ్డు రకాలకు వేర్వేరుగా కేంద్రాలు ఏర్పాటు చేస్తారు. ఒకేచోట రెండూ కొనుగోలు చేస్తే తూకాలు వేర్వేరుగా చేస్తారు. సన్నాల సంచులను ఎరుపు, దొడ్డురకాలను ఆకుపచ్చ దారంతో కుడుతారు. సన్నాల బస్తాలపై 'వై' ఆకారం గుర్తును, కొనుగోలు కేంద్రం సంఖ్య ముద్ర వేయాలని అధికారులు నిర్ణయించుకుంటున్నారు.

వీటిపై దృష్టి సారించాలి

☛ కేంద్రాల వద్ద రైతుల కోసం నీడ, తాగునీటి వసతిని కల్పించాలి.

☛ తూకంలో ఎలాంటి అవకతవకలు జరగకుండా చూడాలి.

☛ కాంటా పూర్తయిన వెంటనే బస్తాలను మిల్లులకు తరలించాలి. మిల్లరు సైతం ధాన్యంలో తేడాలున్నాయని సాకులు చెబుతూ పెట్టే కోతలను నివారించాలి.

☛ ఏఈవోలు ఇచ్చిన టోకెన్ల ప్రకారం తూకాలు వేయాలి.

ప్రజారోగ్యంపై పట్టింపేది?



అంబేడ్కర్ కూడలి ప్రాంతంలో స్టాంపింగ్ లేకుండా విక్రయిస్తున్న మాంసం

పారిశ్రామిక ప్రాంతమైన భూపాలపల్లి జిల్లా కేంద్రంలో గొర్రెలు, మేక మాంసం ఎక్కువగా వినియోగిస్తుంటారు. సింగరేణి కార్మికులు అధికంగా నివాసం ఉంటున్న ఈ ప్రాంతంలో ఆదివారం వచ్చిందంటే ఈ దుకాణాలు కొనుగోలుదారులతో కళకళలాడుతుంటాయి. మాంసాన్ని వండుకోవడానికి వీలుగా సిద్ధం చేసే క్రమంలో ఏ మాత్రం అజాగ్రత్తలు ఉన్నా అనారోగ్యానికి కారణం అవుతుంది. చాలావరకు విక్రయాల్లో నిబంధనలు పాటించడం లేదు. కొద్ది మంది మాత్రం పరిశుభ్రమైన మాంసం అమ్ముతున్నారు. వధించే జీవాల ఆరోగ్యాన్ని ధ్రువీకరించాల్సిన పశు వైద్యాధికారులు అందుబాటులో లేకపోవడంతో భూపాలపల్లి పట్టణంతోపాటు గణపురం మండలం చెల్పూరు, కాటారం తదితర మండలాల్లో మాంసం విక్రయాల్లో నిబంధనలు పాటించడం లేదనే విమర్శలు సర్వత్రా నెలకొన్నాయి. జీవాలను ట్యాగ్ చేసిన తర్వాత కోయాలి. ఇటీవల కురిసిన వర్షాలకు చాలా వరకు జంతువులు రోగాల బారిన పడ్డాయి. మరికొన్ని జీవాలు గాలికుంటు వ్యాధితో మృతిచెందాయి. ఇలాంటి గొర్రెలను కొందరు మాంసంగా మార్చి విక్రయిస్తున్నా పట్టించుకునే నాథుడే లేరు. పురపాలక సంఘంలో ప్రజారోగ్య శాఖ అధికారులు కూడా తమకు సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తున్నారు. కనీసం జిల్లా కేంద్రంలో వధశాల లేకపోవడం వల్ల కూడా మాంసం విక్రయదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.

–న్యూస్‌టుడే, భూపాలపల్లి

వ్యర్థాలతో అనర్థం

జీవాలను కోసిన తరువాత వ్యర్థాలను రోడ్లపైన, మురుగు కాల్వల్లో, వివిధ కాలనీల్లోనే కాకుండా ప్రధాన రోడ్డుకు అతి సమీపంలో ఖాళీగా ఉన్న నివాస ప్లాట్లలో పడేస్తున్నారు. దీంతో దుర్వాసనకు దోమలు, పందులు పెరిగి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో స్థానికులు కొందరు ఫిర్యాదులు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదు. అదేవిధంగా రహదారులపై దుమ్ము, ధూళి మాంసంపై పడుతోంది. మాంసం వ్యర్థాల కోసం వీధి కుక్కలు ఎగబడుతున్నాయి. కాలనీల మధ్యలో శునకాల సంచారం మూలంగా పలువురు గాయాలకు గురవుతున్నారు.

క్వింటాళ్ల కొద్దీ అమ్మకాలు..

జిల్లా కేంద్రంలో సుమారు 25 నుంచి 30 వరకు మాంసం విక్రయ కేంద్రాలుంటాయి. నిత్యం పెద్ద మొత్తంలోనే అమ్మకాలు సాగుతున్నాయి. అదివారం వచ్చిందంటే క్వింటాళ్ల కొద్దీ విక్రయాలు జరుగుతున్నట్లు వ్యాపార వర్గాలు అంచనా వేస్తున్నాయి. పట్టణానికి అతి సమీపంలోనే కేటీపీపీలో పనిచేస్తున్న ఉద్యోగులు సైతం జిల్లా కేంద్రానికి మాంసం కొనుగోలుకు వస్తుంటారు. దీంతో వందల సంఖ్యలో జీవాలు వధిస్తున్నట్లు తెలుస్తోంది. ఆదివారం, పండగల సందర్భంగా వాటి సంఖ్య ఇంకా ఎక్కువగా ఉంటుంది. శాఖాపరంగా ఎన్ని చర్యలు తీసుకున్నా ప్రజల్లోనూ అవగాహన ఉండాలని పశు వైద్యాధికారులు చెబుతున్నారు. మాంసంలో ఏదైనా తేడా ఉంటే జీవాల చిన్న పేగుల్లో ఉండే సుమారు 300 రకాల సూక్ష్మజీవుల లార్వాలు అనేక రకాల వ్యాధులను కలిగించే అవకాశం ఉందని స్థానిక పశు వైద్యాధికారులు తెలిపారు.

నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకుంటాం

- నవీన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, భూపాలపల్లి

రహదారులపైనా, అవాసాల మధ్య జంతువులను వధిస్తే కఠిన చర్యలు తప్పవు. అపరిశుభ్ర వాతావరణంలో ఇష్టానుసారంగా వ్యవహరించే వ్యాపారులపై ప్రత్యేక దృష్టి పెడుతున్నాం. ఇప్పటికే మాంసం విక్రయాలకు పరిశుభ్రత పాటించాలని సూచించాం. మరోసారి పరిశీలించి, నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే వ్యవహరించాలి. లేకుంటే చర్యలు తప్పవు.

బడి పిల్లలకు మళ్లీ రాగి జావ



భూపాలపల్లి, న్యూస్‌టుడే: ఉదయం ఖాళీ కడుపుతో పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. రాగి జావ అందించడం వల్ల మంచి ఫలితాలున్నాయని భావించిన ప్రభుత్వం ఇప్పటికే అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలు చేయాలని నిర్ణయించింది. తాజాగా పీఎం పోషణ్ పథకంలో భాగంగా సర్కారు పాఠశాలల్లోనూ తిరిగి ప్రారంభించాలని ఆయా జిల్లాల విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో మూడు నెలలుగా నిలిచిపోయిన ఈ కార్యక్రమాన్ని దసరా సెలవుల లనంతరం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అమలుచేయనున్నారు.

వారానికి మూడు రోజులు..

ఉమ్మడి వరంగల్ జిల్లా మొత్తం 3,328 ప్రభుత్వ పాఠశాలలుంటే 1 నుంచి 10వ తరగతి వరకు 2.80 లక్షల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. వీరందరికీ ప్రతి రోజు మధ్యాహ్నం భోజనం అందిస్తున్నారు. వీటితో పాటు ఉదయం వేళ వంట ఏజెన్సీల ద్వారా రాగిజావ కూడా అందించనున్నారు. దీంతో ఉదయం వేళ ఆహారం తీసుకోకుండా వచ్చే పిల్లలకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది. ఒక్కో విద్యార్థికి 10 గ్రాముల రాగి పిండి, బెల్లంతో కలిపి మరగబెట్టిన జావను వారంలో మూడు రోజుల పాటు అందించనున్నారు.

విద్యార్థులకు ఎంతో ప్రయోజనం

రాజేందర్, డీఈవో, భూపాలపల్లి

రాగి జావ అందించడం వల్ల చాలా మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది. కొందరు ఉదయం పూట ఏమీ తినకుండానే పాఠశాలలకు వస్తున్నారు. దీన్ని గమనించే ప్రభుత్వం రాగి జావ అందించాలని నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వం నుంచి అవసరమైన పిండి, బెల్లం సరఫరా కాగానే అమలయ్యేలా చర్యలు తీసుకుంటాం. రాగి జావ విద్యార్థులకు బలవర్థకమైన ఆహారం. ఫలితంగా వారిలో చురుకుదనం పెరుగుతుంది.


హేమాచల క్షేత్రంలో భక్తుల సందడి



మల్లూరు(మంగపేట), న్యూస్‌టుడే: మండలంలోని మల్లూరుగుట్టపై శ్రీహేమాచల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. ఆదివారం సెలవు దినం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి స్వామిని దర్శించుకొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

వాజేడు, న్యూస్‌టుడే: బొగత జలపాతంలో సందర్శకులు ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపారు. ఆదివారం సెలవు రోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులతో జలపాతం కోలాహలంగా మారింది.



లీకేజీలు ఇలా.. తాగునీరు అందేది ఎలా?



భారాస కార్యాలయం సమీపంలో..



భూపాలపల్లి ఆర్టీసీ ప్రధాన గేట్ పక్కన

ఎంతో ఖర్చు చేస్తూ, ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తున్నారు. అదే తాగునీటిని ఏ మాత్రం వృథా కాకుండా ఉపయోగించుకోవాలి. జిల్లా కేంద్రంలోని భారాస కార్యాలయం సమీపంలో జాతీయ రహదారి పక్కన గేట్ వాల్వు లీకేజీతో మిషన్ భగీరథ నీరు వృథాగా పోతోంది. గత కొద్ది రోజులుగా లీకేజీ అవుతున్నా ఎవరూ పట్టించుకోవటం లేదు. పైగా ఇదే గేట్ వాల్వు నుంచి తాగునీటిని ఉపయోగించుకుంటున్నారు. ఇదే రహదారిపై నిత్యం కలెక్టర్ ఇతర అధికారులు పర్యటిస్తారు. కానీ ఈ లీకేజీ గురించి పట్టించుకోవటం లేదు. భూపాలపల్లి ఆర్టీసీ బస్ డిపో ప్రధాన గేట్ పక్కన తాగునీటి బోరు వద్ద పైపులైన్ లీకేజీ కారణంగా నీరు వృథాగానే పోతోంది. ఈ బోరును నిత్యం అధికారులు, కార్మికులు చూస్తున్నారు. లీకేజీని సవరించాలనే ఆలోచన రాకపోవడం గమనార్హం.

– భూపాలపల్లి, న్యూస్‌టుడే

జలపాతంలో మునిగి యువకుడి మృతి

వాజేడు: ములుగు జిల్లా వాజేడు మండలం కొంగాల సమీపంలోని దుసపాటి లొద్ది జలపాతంలో మునిగి ఆదివారం బండారి అభినవ్ (19) అనే యువకుడు మృతిచెందారు. స్నేహితులతో కలిసి జలపాతంలోకి దిగిన అభినవ్ నీటిలోని రాయిపై అడుగువేసిన వెంటనే నీటిలోకి జారిపోయాడు. సంఘటనను గుర్తించిన స్నేహితులలో ఒకరు కాపాడేందుకు ప్రయత్నించినా ప్రయోజనం లేకపోయింది.

పండగ వేళ.. ట్రాఫిక్ పద్మవ్యూహం

● సిబ్బంది లేక ఇబ్బందులు



కాజీపేట బ్రిడ్జి వద్ద వాహనాల రద్దీ.. ఇక్కడ రైల్వే వంతెన ఒకటే ఉండడంతో నిత్యం ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. అసంపూర్తిగా ఉన్న మరో రైల్వే వంతెన పూర్తి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

దేవీ నవరాత్రి ఉత్సవాలు, దసరా పండగను పురస్కరించుకొని వరంగల్ నగరంలో ట్రాఫిక్ రద్దీ విపరీతంగా పెరిగింది. పండగ సామగ్రి, దుస్తుల కొనుగోళ్లకు ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి తరలివస్తున్న ప్రజలతో మార్కెట్ రోడ్లన్నీ కిక్కిరిసి పోతున్నాయి. కాజీపేట నుంచి వరంగల్, కరీంనగర్ రహదారిలో వాహనాల సంఖ్య అధికంగా ఉంటోంది. దీంతో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు నెలకొంటున్నాయి. పండగ రద్దీ నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసులు, నగరవాసులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కథనం..

వరంగల్ క్రైం, న్యూస్‌టుడే

● ప్రతినెలా 4 వేల వరకు కొత్త వాహనాలు రిజిస్ట్రేషన్ అవుతున్నాయి.

ఇదీ పరిష్కారం..

- రోడ్లు ఇరుకుగా ఉండి జనసంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో వన్‌వేలను ఏర్పాటు చేయాలి.
- సిగ్నల్స్ వద్ద ఫ్రీ లెఫ్ట్ ఉండేలా చర్యలు తీసుకోవాలి.
- ఉదయం, సాయంత్రం కళాశాలలు, పాఠశాలల సమయంలో అదనంగా సిబ్బందిని నియమించి ట్రాఫిక్‌ను నియంత్రించాలి.
- రద్దీని బట్టి ట్రాఫిక్ కూడళ్ల వద్ద అదనంగా సిబ్బందిని కేటాయించాలి.

రోడ్లపై 2 లక్షలకు పైగా వాహనాలు..

● పోలీసు శాఖ లెక్కల ప్రకారం కమిషనరేట్ పరిధిలోని వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల్లో రెండు, నాలుగు చక్రాలు, భారీ వాహనాలు కలిపి సుమారు 4.50 లక్షల వరకు ఉంటాయి. ప్రతి రోజు ఇతర ప్రాంతాల నుంచి లక్ష వరకు వాహనాలు నగరానికి వచ్చి వెళ్తుంటాయి. అన్ని కలిపి నగరంలో రోజుకు 2 లక్షలకు పైగా వాహనాలు తిరుగుతుంటాయని పోలీసుల అంచనా. పండగల వేళ మరో 20 వేలు అధికంగా తిరుగుతుంటాయి.

ట్రాఫిక్ ఉల్లంఘనలపై చలాన్లు ఇలా..

నగరంలో మూడు ట్రాఫిక్ ఠాణా పరిధిలో ఈఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు విధించిన ట్రాఫిక్ చలాన్లు కేసుల నమోదు

ఉల్లంఘనలు	కేసుల సంఖ్య	జరిమానా (రూ.లలో)
హెల్మెట్ లేకుండా చలాన్లు	2,56,767	4,24,71,300
రాంగ్ రూట్ డ్రైవింగ్	11,531	22,92,400
ట్రిపుల్ రైడింగ్	10,261	1,19,91,600
చరవాణి మాట్లాడుతూ డ్రైవింగ్	6004	59,58,000



తిరుమల జంక్షన్‌లో..

ఇదీ పరిస్థితి..

పెరిగిన ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు ప్రస్తుతం నగరంలోని మూడు ట్రాఫిక్ ఠాణాలోని సిబ్బంది సరిపోవడం లేదు. ఏఆర్ విభాగం నుంచి కొందరిని కేటాయించారు. అయినప్పటికీ కాజీపేట ఫాతిమా నగర్ బ్రిడ్జి, పెట్రోల్‌పంపు, లష్కర్‌బజార్, హనుమకొండ చౌరస్తా, ఎన్‌జీవోస్ కాలనీ రోడ్డు, నయీంనగర్, వరంగల్ పోచమ్మ మైదానం, వరంగల్ చౌరస్తా, హెడ్ పోస్టాఫీస్, ఎస్‌వీఎన్ రోడ్డు ప్రాంతాల్లో నిత్యం ట్రాఫిక్ జామ్ కావడంతో పాటుగా రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఇక్కడ ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని ప్రజలు కోరుతున్నారు.

● పదేళ్లలో నగరంలో వాహనాల సంఖ్య వంద శాతం పెరిగింది. ఆ స్థాయిలో రహదారుల విస్తరణ జరగలేదు. దీంతో నిత్యం ట్రాఫిక్ సమస్య ఉంటుంది. పండగల సమయంలో ట్రాఫిక్ నియంత్రణ కోసం సిబ్బందిని పెంచాలి.



వరంగల్ చౌరస్తా నుంచి బట్టల బజార్ రోడ్డు..



వరంగల్ చౌరస్తాలో అన్ని వైపులకు ఒకరే ట్రాఫిక్ పోలీసు..

సిబ్బంది సంఖ్య పెరగాలి..

ప్రస్తుతం వరంగల్ కమిషనరేట్ పరిధిలో 14 నుంచి 16 కిలోమీటర్ల వరకు ట్రాఫిక్ రద్దీ ఉంటుంది. ఇన్ని కిలోమీటర్ల దూరం ట్రాఫిక్ క్రమబద్ధీకరించాలంటే సుమారు 400లకు పైగా సిబ్బంది అవసరం.

● ప్రస్తుతం 140 మంది ట్రాఫిక్ సిబ్బంది, 100 మంది హోంగార్డులు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. గతంలో కంటే ట్రాఫిక్ నియంత్రణ పాయింట్లు పెరిగాయి. నగర శివారులతో కలిపి మొత్తం 51 ట్రాఫిక్ పాయింట్లు, 11 సిగ్నల్స్ ఉన్నాయి.

● నగరంలో మూడు ట్రాఫిక్ ఠాణాలు మాత్రమే ఉన్నాయి. మరో మూడు అవసరం ఉంది.

పార్కింగ్‌తో సమస్య..

నగరంలో పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్ వచ్చాయి. వీటిలో షాపింగ్ చేసేందుకు వచ్చే ప్రజలు వాహనాలను రోడ్డుపై నిలుపుతున్నారు.

ఇలా చేద్దాం: షాపింగ్ మాల్స్ ఆవరణలోని సెల్లార్లల్లో వాహనాలను పార్కింగ్ చేయాలి.

● వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటించాలి. రాంగ్ రూట్‌లో రావడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీని వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. సిగ్నల్స్‌ను పట్టించుకోకుండా ముందుకు వెళ్లడంతో ఇతర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

● వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటిస్తే ఇబ్బందులు ఉండవని ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ తెలిపారు.

మహాలక్ష్మీ.. కరుణించు తల్లీ!



రంగంపేట, న్యూస్‌టుడే: సిరి సంపదలివ్వమ్మా శ్రీమహాలక్ష్మీ అంటూ భక్తులు వేడుకున్నారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాలుగోరోజు ఆదివారం భద్రకాళి అమ్మవారు మహాలక్ష్మీగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నిత్యాహ్నికం, సాయంత్రం గిరిజా దుర్గార్చన పూజారాధనలు జరిపారు. ఉదయం 11 గంటలకు సూర్యప్రభ వాహనం, సాయంత్రం హంస వాహన సేవలు నిర్వహించారు. రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్ సిరిసిల్ల రాజయ్య తదితర ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు.

అందరూ ముఖ్యులే.. సాధారణ భక్తులకు అవస్థలు!



అమ్మవారి దర్శనానికి వరుసలో ఉన్న సాధారణ భక్తులు



వీఐపీ ద్వారం వద్ద రద్దీ

రంగంపేట, న్యూస్‌టుడే: శరన్నవరాత్రి ఉత్సవాల వేళ భక్తులు భద్రకాళి ఆలయానికి పోటెత్తుతున్నారు. రద్దీకి అనుగుణంగా దేవస్థానం అధికారులు, ఉద్యోగులు తగిన ఏర్పాట్లు చేయడం లేదు. ఆదివారం అమ్మవారిని దర్శించుకునేందుకు వేలాది మంది భక్తులు వచ్చారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో దాదాపు 2-3 గంటల పాటు అన్ని క్యూలైన్లలో సాధారణ భక్తులు బారులుతీరారు. వీళ్లను అలాగే వదిలేసి వీఐపీ(అత్యంత ముఖ్యమైన వ్యక్తి) ద్వారంలో నుంచి వందలాది మందిని ఒకేసారి లోనికి పంపించడంతో గందరగోళం నెలకొంది. కొందరు ప్రైవేటు వ్యక్తులు, అర్చకులు బంధువులు, స్నేహితులను వీఐపీ మార్గం గుండా తీసుకెళ్లారు. గంటల తరబడి సాధారణ భక్తులు క్యూలైన్లలో విలవిల్లాడారు. తాగునీటి కోసం అల్లాడారు. రద్దీని కట్టడి చేసేందుకు వెళ్లిన ఈవో శేషభారతి సైతం అందులో ఇరుక్కుపోయారు. సాధారణ భక్తులను వదిలేసి వీఐపీ మార్గానికే ప్రాధాన్యం ఇచ్చారని భక్తులు నిలదీశారు.

ప్రైవేటు పెత్తనం..: భద్రకాళి ఆలయంలో ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకుల పేరుతో పలువురు.. మాజీ ధర్మకర్తలు, దాతల పేరుతో కొంతమంది ప్రైవేటు వ్యక్తులు పెత్తనం చెలాయిస్తున్నారు. వీఐపీ క్యూలైన్ వద్ద వారిదే హవా నడుస్తోంది. కొందరు అర్చకులు సైతం అతిగా వ్యవహరిస్తున్నారు. అడ్డదారిలో భక్తులను గర్భాలయంలోకి తీసుకెళ్తున్నారు.

తెల్లబంగారం.. అన్నింటికీ ఆధారం

నేడు ప్రపంచ పత్తి దినోత్సవం

ఉమ్మడి వరంగల్‌వ్యాప్తంగా రైతులు పండించే ప్రధాన పంట పత్తి.. ఇది వారికి ముఖ్యమైన ఆదాయ వనరు. సోమవారం ప్రపంచ పత్తి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ పంట ప్రధాన్యం, ఉపాధి అవకాశాలపై ప్రత్యేక కథనం..

పత్తి ప్రాధాన్యం.. ప్రాముఖ్యాన్ని గుర్తించడంతో పాటు పత్తిపై అవగాహన పెంచేందుకు, సాగును ప్రోత్సహించడమే లక్ష్యంగా ఏటా అక్టోబరు 7న ప్రపంచ పత్తి దినోత్సవం నిర్వహిస్తున్నారు.

ఈ ఏడాది పత్తి దినోత్సవం ఉద్దేశం 'కాటన్ ఫర్ గుడ్'. దీనిని ప్రపంచ వాణిజ్య సంస్థ, యునైటెడ్ నేషన్స్ కాన్ఫరెన్స్ ఆన్ ట్రేడ్ అండ్ డెవలప్‌మెంట్, ఇంటర్నేషనల్ ట్రేడ్ సెంటర్ సంయుక్తంగా నిర్ణయించారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది 5,13,289 ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేయగా.. 4,10,632 మెట్రిక్ టన్నుల పత్తి దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు.

ఎనుమాముల మార్కెట్, న్యూస్‌టుడే



మీకు తెలుసా..

- ప్రపంచ దేశాలతో పోలిస్తే మనదేశం 40 శాతం తెల్లబంగారాన్ని పండిస్తోంది.
- ప్రపంచ వ్యాప్తంగా పత్తిని వాణిజ్య పంటగానే కాకుండా ఆహార, చమురు పంటగా గుర్తిస్తున్నారు. పత్తి గింజలను వంట నూనెగా, గింజల చెక్కను పశు దాణాగా వాడుతున్నారు. కొన్ని దేశాల్లో గింజల నూనెను జీవ ఇంధనం తయారీకి వినియోగిస్తున్నారు.
- పత్తి తన సొంత బరువు కన్నా 27 రెట్లు నీటిని గ్రహించగలదు. దాంతో కావాల్సిన సాంద్రతతో వస్త్రాలను నేయవచ్చు. నాణ్యత కాటన్ ఫ్యాబ్రిక్‌కు సులభంగా రంగులు వేసేందుకు వీలుగా ఉంటుంది.
- ఓ జీన్స్ తయారీకి 0.68 కిలోలు, చొక్కాకు 0.28 కిలోలు, టీషర్టుకి 0.23 కిలోలు, డైపర్ తయారీకి 0.07 కిలోలు, టవల్‌కు 0.28 కిలోలు పత్తి అవసరమని అంచనా.



హనుమకొండ జిల్లా ఆత్మకూరులో పత్తి తీస్తున్న మహిళా కూలీ (పాతచిత్రం)

ఏడాది పొడవునా ఉపాధి..

అంతర్జాతీయ పత్తి సలహా కమిటీ(ఐసీఏసీ) అంచనా ప్రకారం.. రైతు పండించిన ఓ టన్ను పత్తి అయిదుగురికి ఏడాది పొడవునా ఉపాధి కల్పిస్తోంది. వైద్య రంగం, పశుగ్రాసం, వంటనూనె పరిశ్రమలతో పాటు వస్త్ర పరిశ్రమలకు ఇది ముడి సరకు. వ్యవసాయం, తయారీ, రిటైల్ రంగాల్లో ఉద్యోగాలను సృష్టిస్తోంది. ఉమ్మడి జిల్లాలో ప్రత్యక్షంగా 10 వేల మందికి, పరోక్షంగా 20 వేల మందికి పైగా పత్తి పరిశ్రమ ఉపాధి కల్పిస్తుంది. రైతులు, కూలీలతో పాటు వ్యాపారులు, జిన్నింగ్ మిల్లుల యజమానులు, ఫిట్టర్లు, ప్రెస్సింగ్, జిన్నింగ్ ఆపరేటర్లు, హమాలీలు, మార్కెటింగ్‌శాఖ, వస్త్ర పరిశ్రమ, తదితర అనుబంధ రంగాల్లో పనిచేస్తున్న వారికి ఉపాధి లభిస్తోంది.

● ఉమ్మడి జిల్లాలో మొత్తం 55 జిన్నింగ్ మిల్లులుండగా.. ఒక్కో మిల్లులో సుమారు 150 మంది పనిచేస్తూ.. తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు.

రంగురంగుల్లో.. పంట

పత్తి అనగానే మనకు తెల్లని దూది మాత్రమే స్ఫురిస్తుంది. ఆ దూదిని రంగురంగుల్లో పండించేందుకు పరిశోధకులు ప్రయత్నిస్తున్నారు. నాగపూర్‌లోని ఇండియన్ కౌన్సిల్ ఫర్ అగ్రికల్చర్ రిసెర్చ్ సంస్థ, దార్వాడలోని అగ్రికల్చరల్ సైన్సెస్ యూనివర్సిటీలకు చెందిన నిపుణులు రంగుల పత్తి వంగడాలను సృష్టించి, ఏడేళ్లుగా వివిధ ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా పండిస్తున్నారు. సహజసిద్ధంగా పత్తికి రంగు రావడంతో.. అదనంగా పత్తి దారాలకు రంగు నీళ్లలో ముంచాల్సిన అవసరం ఉండదు. దాంతో జల కాలుష్యాన్ని తగ్గించవచ్చని పరిశోధకులు అభిప్రాయపడుతున్నారు.



వివిధ ప్రాంతాలకు ఎగుమతి..

ఉమ్మడి వరంగల్‌లో పండిన పత్తిని వ్యాపారులు వివిధ ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. ఇక్కడి నుంచి స్పిన్నింగ్ చేసిన దూది బేళ్లు ఆంధ్రప్రదేశ్, గుజరాత్, తమిళనాడు రాష్ట్రాలతో పాటు బంగ్లాదేశ్, వియత్నాం, చైనా దేశాలకు ఎగుమతి అవుతుంది. పత్తి నుంచి వేరుచేసిన గింజలను వంట నూనె, పశువుల దాణా తయారీ కోసం హరియాణా, పంజాబ్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలకు వ్యాపారులు ఎగుమతి చేస్తుంటారు.

పత్తి ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలి

- బొమ్మినేని రవీందర్‌రెడ్డి, పత్తి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

రాష్ట్రంలో పత్తి ఆధారిత, అనుబంధ పరిశ్రమలు లేకపోవడంతో ఇక్కడ పండిన దిగుబడులు ఇతర రాష్ట్రాలు, దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. పరిశ్రమల ఏర్పాటుతో ఇక్కడి యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడటంతో పాటు రవాణా భారం తగ్గుతుంది. యూరియా సంచుల్లో రైతులు పత్తిని తీసుకురావడం వల్ల తెల్లని ప్లాస్టిక్ వ్యర్థాలు పత్తిలో కలిసిపోతున్నాయి. స్పిన్నింగ్ మిల్లులు అలాంటి పత్తిని తిరస్కరిస్తున్నాయి. ప్రభుత్వం యూరియా బస్తాల రంగును మార్చడం ద్వారా ఈ సమస్య పరిష్కరించవచ్చు.

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఈ ఏడాది వివరాలు

● పత్తి సాగు (ఎకరాల్లో) ● దిగుబడి అంచనా (మెట్రిక్ టన్నుల్లో)

జిల్లా	పత్తి సాగు (ఎకరాల్లో)	దిగుబడి అంచనా (మెట్రిక్ టన్నుల్లో)
వరంగల్	1,20,037	96,030
హనుమకొండ	77,330	61,864
ములుగు	21,114	16,891
జనగామ	1,25,195	1,00,156
భూపాలపల్లి	91,281	73,025
మహబూబాబాద్	78,332	62,666

పవర్ లిఫ్టింగ్‌లో రజత పతకం



సాధించిన పతకంతో సుకన్య

సీరోలు(కురవి), న్యూస్‌టుడే: మహబూబాబాద్ జిల్లా సీరోలు మండలం రేకుల తండా గ్రామపంచాయతీ శివారు జగ్యాతండాకు చెందిన తేజావత్ సుకన్య కామన్‌వెల్త్ పవర్‌లిఫ్టింగ్ ఫెడరేషన్ పోటీల్లో రజత పతకం సాధించారు. మారుమూల గిరిజన తండాలోని మధ్య తరగతి గిరిజన కుటుంబంలో జన్మించిన ఆమె క్రీడల్లో రాణించాలనే తపనతో ముందుకు సాగుతున్నారు. డిగ్రీ వరకు చదువుకున్న ఆమె తొలుతగా వెయిట్ లిఫ్టింగ్‌తో ప్రారంభించి అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకాలు పొందారు. 2024 జూన్‌లో దక్షిణ ఆఫ్రికా దేశంలో పవర్‌లిఫ్టింగ్‌లో రాణించి పతకం సాధించారు. ఈనెల 4 నుంచి దక్షిణాఫ్రికా దేశంలోని సన్‌సిటీలో జరుగుతున్న పోటీల్లో శనివారం రాత్రి జరిగిన బాలికల విభాగం పవర్‌లిఫ్టింగ్‌లో 76 కిలోల బరువు ఎత్తి రెండో స్థానంలో నిలిచి రజత పతకం దక్కించుకున్నారు. తండ్రి లక్ష్మణ్ ఇల్లందులో సింగరేణి ఉద్యోగం చేస్తున్న క్రమంలో తల్లిదండ్రులతో కలిసి రోజు ఉదయం వాకింగ్‌కు వెళ్లేవారు. అక్కడ కొంత మంది వెయిట్‌లిఫ్టింగ్ సాధన చేస్తుండగా వారితోపాటు సుకన్య చేసేవారు. ఆసక్తి పెరగడంతో అక్కడి నుంచి హైదరాబాద్‌కు వెళ్లి శిక్షణ పొంది జిల్లా స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయిలో బంగారు, వెండి పతకాలు సాధించారు. దక్షిణ ఆఫ్రికాకు వెళ్లేందుకు సహకరించిన గ్రీన్‌కో సంస్థ గ్రూపు ఛైర్మన్ అనీల్‌కుమార్‌శెట్టికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

నేడు, రేపు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: 10వ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఈ నెల 7, 8 తేదీల్లో నిర్వహించనున్నట్లు రాష్ట్ర, హనుమకొండ జిల్లా అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి సారంగపాణి తెలిపారు. అండర్-14, 16, 18, 20 విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాలు, 10 క్రీడా పాఠశాలల నుంచి అథ్లెట్లు హాజరవుతారన్నారు. ముఖ్య అతిథిగా పారా ఒలింపియన్ జీవాంజి దీప్తి, ఇతర జాతీయస్థాయి అథ్లెట్లు, ముగింపు వేడుకలకు ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేశ్ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

తెలంగాణ ఉద్యమ చరిత్రను రికార్డు చేయాలి



సదస్సులో ప్రసంగిస్తున్న కోదండరాం, వేదికపై అంబటి శ్రీనివాస్, కేయూ ప్రొఫెసర్ వెంకటనారాయణ తదితరులు

నర్సంపేట, న్యూస్‌టుడే: భావితరాలకు తెలిసేలా తెలంగాణ ఉద్యమాన్ని రికార్డు చేయాలని ఎమ్మెల్సీ, తెజస వ్యవస్థాపక అధ్యక్షుడు కోదండరాం ప్రభుత్వాన్ని కోరారు. ఈ చరిత్రను మరుగున పడేసేందుకు కొందరు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. తెలంగాణ ఐకాస నర్సంపేట డివిజన్ కమిటీ, తెజస ఆధ్వర్యంలో ఆదివారం వరంగల్ జిల్లా నర్సంపేటలో వేడుకల మందిరంలో నిర్వహించిన జిల్లాస్థాయి తెలంగాణ ఉద్యమకారుల సదస్సులో కోదండరాం మాట్లాడారు. స్వయంపాలన కోసం అరవై ఏళ్లుగా ఎన్నో సంఘాలు, ఎందరో చేసిన పోరాటం, 1200 మంది ప్రాణత్యాగాలతో ప్రత్యేక రాష్ట్రం కల సాకారమైందన్నారు. గత ప్రభుత్వంలో మాదిరిగా నిర్బంధాలు, ఫోన్‌ట్యాపింగ్, అక్రమ అరెస్టులు లేవని, ప్రజాస్వామిక తెలంగాణ నిర్మాణానికి పాటుపడదామన్నారు. అమరుల కుటుంబాలకు పింఛన్లు, ఇళ్ల స్థలాలు, గుర్తింపు కార్డులిచ్చి వారి సంక్షేమానికి కృషి చేయాలన్నారు. స్థానిక అయ్యప్పస్వామి ఆలయం వద్ద కోదండరాంకు స్థానికులు స్వాగతం పలికారు. అమరవీరుల స్తూపం, చాకలి ఐలమ్మ, అంబేడ్కర్, వడ్డెర జాతి నాయకుడు ఓబలన్న విగ్రహాలకు ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెజస రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ మాట్లాడుతూ రెండు నెలల్లో తెలంగాణ ఉద్యమకారుల సమస్యలను పరిష్కరించకపోతే మరో ఉద్యమం తప్పదన్నారు. కేయూ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ ప్రసంగిస్తూ గత పదేళ్లలో తెలంగాణ వనరులను దోపిడీ చేసిన దొంగలు పది నెలల్లో ఏదో జరిగినట్లు రచ్చ చేస్తున్నారన్నారు. ఈ సర్కార్‌ను కాపాడుకోవాలన్నారు. కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సదస్సులో నిట్ ప్రొఫెసర్ రమ, ఉద్యమకారులు, ప్రజా సంఘాల, ఐకాస నాయకులు రామ్మూర్తి, జావిద్, అరుణ, ఖాలీ సయ్యద్, అరుణ, డాక్టర్ జగదీశ్వర్, రమాదేవి పాల్గొన్నారు. వివిధ సంఘాల నాయకులు కోదండరాంకు వినతి పత్రాలు సమర్పించారు.

పిడుగుపాటుతో ఒకరికి తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న ఆర్.సింగారం రఘు

నెల్లికుదురు, న్యూస్‌టుడే: పిడుగుపడి ప్రైవేటు కంపెనీలోని ఇంజినీరింగ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి తీవ్రంగా గాయపడిన ఘటన మండలంలోని నర్సింహులగూడెంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగ్‌పూర్ నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజదాని అమరావతి వరకు గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణ పనులు కొనసాగిస్తున్నారు. నిర్మాణ సామగ్రి సంబంధిత ఉద్యోగులు, సిబ్బంది నివాసం కోసం ఆలేరు, నర్సింహులగూడెం గ్రామాల పరిధిలో క్యాంప్ ఏర్పాటు చేశారు. తమిళనాడు రాష్ట్రం వెళ్లూరు జిల్లా తిరుపత్తూరు, పెరియార్‌కొట్టం ప్రాంతానికి చెందిన ఇంజినీరు ఆర్. సింగారం రఘు మూడు నెలల నుంచి పనిచేస్తున్నారు. ఆదివారం క్యాంప్ కార్యాలయం ఆరుబయట చరవాణిలో మాట్లాడుతున్నారు. అకస్మాత్తుగా పిడుగు పడటంతో ఆయన తీవ్రంగా గాయపడగా అక్కడ ఉన్న వారు సీపీఆర్ చేసి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్

ఫాం:	114
రిటైల్:	136
డ్రెస్డ్:	197
స్కిన్‌లెస్:	224

అన్నపూర్ణా దేవి అవతారంలో అమ్మవారు


మొట్లపల్లి గ్రామంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మొగుళ్లపల్లి, న్యూస్‌టుడే: శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మొట్లపల్లి గ్రామంలోని శ్రీఅభయాంజనేయ స్వామి దేవాలయంలో శ్రీవెంకటేశ్వర ధార్మిక భజనమండలి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మండపంలో కొలువుదీరిన దుర్గామాత ఆదివారం అన్నపూర్ణా దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వోల్లాల లక్ష్మణ్, కర్ణాటకపు దేవేందర్, గన్నారపు యాదగిరి కుటుంబ సభ్యులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.


గణపురం దుర్గామాత మండపంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు దంపతులు

ఎమ్మెల్యే దంపతుల పూజలు

గణపురం, న్యూస్‌టుడే: గణపురంలో ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటుచేసిన మండపం వద్ద ఆదివారం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పద్మ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే జీఎస్సార్ మాట్లాడుతూ దుర్గామాత దేవి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా ఉండాలని పాడి పంటలు సమృద్ధిగా పండాలని కోరుకున్నట్లు తెలిపారు.

మహాలక్ష్మీ...నమోస్తుతే

మహదేవపూర్, న్యూస్‌టుడే : శ్రీ దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. మహదేవపూర్ మండల కేంద్రంలోని గర్భగౌరి సంస్థాన్ ఆధ్వర్యంలో శరన్నవరాత్రోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. కాటారం డీఎస్పీ రామ్మోహన్ దంపతులు అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. దుబ్బగూడెం, గంగదేవి ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మీ అవతారంలో దర్శనమిచ్చారు. సామూహికంగా లలిత సహస్రనామ పారాయణం చేశారు.


గర్భగౌరి సంస్థాన్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న డీఎస్పీ రామ్మోహన్


మహదేవపూర్ దుబ్బగూడెంలో మహాలక్ష్మీ అవతారంలో అమ్మవారు

మేమున్నాం.. మీకు తోడుగా

టేకుమట్ల: 96032 95502, భూపాలపల్లి: 94408 47097, భూపాలపల్లి రూరల్: 99592 57553 (10 AM TO 1 PM)

భూపాలపల్లి: మదీనా కాలనీ మసీదు ప్రాంతంలో జంగేడు రోడ్డు పక్కన చెత్త చెదారం పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. దోమలు, పందుల బెడద ఎక్కువైంది.
- రాజ్‌మహ్మద్, మదీనా కాలనీ

పారిశుద్ధ్య కార్మికులను పంపించి చెత్తాచెదారాన్ని తొలగించటానికి చర్యలు తీసుకుంటాం.
- నవీన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

● జవహర్‌నగర్ కాలనీలో రోడ్డు పక్కన తాగునీటి పైప్‌లైన్ లీకేజీ కారణంగా నీరు వృథాగానే పోతోంది. తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం ఉంది.
- రాజవీరు, జవహర్‌నగర్

కార్మికులను పంపించి, పైప్‌లైన్‌కు మరమ్మతు పనులు చేయించటానికి చర్యలు తీసుకుంటాం.
- సెగ్గం వెంకటరాణి, ఛైర్‌పర్సన్

రేగొండ, న్యూస్‌టుడే: రేగొండ మండలం భాగిర్థిపేట గ్రామం గొల్లపల్లి వీధిలోని కల్వర్టుపై ఉన్న రంధ్రాన్ని ఎవరూ పూడ్చటం లేదు .**- రాజయ్య, గ్రామస్థుడు**

అధికారులతో మాట్లాడి ఒకటి రెండు రోజుల్లో రంధ్రాన్ని పూడ్చివేయిస్తాం. **- పంచాయతీ కారోబార్, రాములు**

వీధి దీపాల ఏర్పాటు



కాశింపల్లి శివారు బాలాజీనగర్ కాలనీలో నాలుగు రోజులుగా వీధి దీపాలు వెలగక పోవడంపై కాలనీకి చెందిన మహిళలు కొందరు 'మేమున్నాం.. మీకు తోడుగా..' కు సమాచారం ఇచ్చారు. ఈ విషయాన్ని వార్డు కౌన్సిలర్ తిరుపతి దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించారు. విద్యుత్తు సిబ్బందితో మాట్లాడి ఒకటి రెండు రోజుల్లో సిబ్బందిని పంపించి, కాలనీలో వీధి దీపాలు ఏర్పాటు చేయించారు.

పాలకమండలి నియామకమయ్యేనా?



కాళేశ్వరం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కొత్తగా ప్రభుత్వం ఏర్పడ్డాక ఈ ప్రాంత కాంగ్రెస్ నాయకులు కాళేశ్వరాలయం ఛైర్మన్ పదవి దక్కించుకోవాలని ఆశిస్తున్నారు. ప్రభుత్వం పాలకమండలి నియామకంపై గత నెలలో ప్రకటన విడుదల చేసింది. సెప్టెంబర్ 18 వరకు దరఖాస్తులు స్వీకరించారు. గడువు ముగియడంతో ఎప్పుడెప్పుడు పాలకమండలి ఏర్పడుతుందా అని ఆశావహులు ఎదురు చూస్తున్నారు. మంత్రి శ్రీధర్‌బాబు ఆశీస్సులను పొందేందుకు సర్వ ప్రయత్నాలు చేస్తున్నారు. మంత్రి మదిలో ఎవరున్నారో అత్యంత సన్నిహిత నాయకులకు కూడా అంతు చిక్కడం లేదు. శ్రీధర్‌బాబు మహదేవపూర్ మండలం నుంచి ఛైర్మన్ నియామకం చేపడతారని చెప్పినట్లు ప్రచారం జరుగుతుండగా మహదేవపూర్ నుంచి ఇద్దరు నాయకులు, కాళేశ్వరం నుంచి ఒకరు తమ ప్రయత్నాలు తీవ్రతరం చేస్తున్నారు. జనవరిలో పంచాయతీ ఎన్నికలుంటాయని, అనంతరం పాలకమండలి ఏర్పాటు అవుతుందని సీనియర్ నాయకులు అభిప్రాయాలను వెలిబుచ్చుతున్నారు. మునుపెన్నడు లేని విధంగా ఇటీవల దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి శైలజరామయ్యర్ కాళేశ్వరం సత్వర అభివృద్ధిపై వివిధ శాఖలతో సమీక్ష నిర్వహించడంతో ఛైర్మన్ పదవికి డిమాండు పెరిగింది. అటు మంత్రి ఆశీస్సులతో ఛైర్మన్ పదవి దక్కించుకుంటే అభివృద్ధిలో తమ భాగస్వామ్యం తోడై, స్వామి వారికి సేవ చేసే భాగ్యం దక్కుతుందని కొందరు, ప్రొటోకాల్ కోసం మరి కొందరు ఆశావహులు అభిప్రాయపడుతున్నట్లు తెలుస్తోంది.

ఎస్సీ వర్గీకరణ కోరుతూ 9న ప్రదర్శన


మహదేవపూర్ ప్రెస్ భవన్ ఎదుట మాట్లాడుతున్న నాయకులు

మహదేవపూర్, న్యూస్‌టుడే : ఎస్సీ వర్గీకరణ వెంటనే రాష్ట్రంలో అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బెల్లంపల్లి సురేశ్ తెలిపారు. ఇటీవల జరిగిన డీఎస్సీ నియామకాల్లో తీవ్ర అన్యాయం జరిగిందని, మిగతా నియామకాల్లో కచ్చితంగా వర్గీకరణ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 9న తేదీన జిల్లా కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు నిరసన ర్యాలీ ఉంటుందని, ఈ కార్యక్రమానికి శ్రేణులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రవితేజ, సదానందం, ప్రవీణ్, రాము పాల్గొన్నారు.

నూతన మండల కమిటీ ఎన్నిక


వెలిశెట్టి రాజయ్య

భూపాలపల్లి, న్యూస్‌టుడే: భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు భూపాలపల్లి మండల కార్యదర్శిగా వెలిశెట్టి రాజయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం జరిగిన నాలుగో మహాసభలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. సభ్యులుగా మాదాసు గోపాల్, దుర్గేశ్, సుబ్బయ్య, భిక్షపతి, రాజశేఖర్, రమ, లక్ష్మీనారాయణ, శంకరమూర్తి, శారద తదితరులను ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శి బంధు సాయిలు మాట్లాడుతూ నూతన సభ్యులు మండల, జిల్లా అభివృద్ధికి, ప్రజల సమస్యల పరిష్కారానికి సమరశీల పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక


విద్యార్థిని అంజలిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మహదేవపూర్, న్యూస్‌టుడే : మహదేవపూర్ జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న పెద్ది అంజిలి రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ అండర్ 16 షార్ట్‌పుట్ విభాగంలో ఎంపికైనట్లు పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. ఈ నెల 6, 7 తేదీల్లో హనమకొండలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనున్నట్లు తెలిపారు. విద్యార్థినిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సరిత, ఉపాధ్యాయులు సన్మానించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో జడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

చిట్యాల, న్యూస్‌టుడే: చిట్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999-2000 సంవత్సరంలో, కాకతీయ హైస్కూల్‌లో 2009-10 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. పాఠశాలతో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. బాల్యస్మృతులను నెమరేసుకున్నారు. అలనాటి జ్ఞాపకాలను, చేసిన అల్లరిని గుర్తు చేసుకుంటూ ఒకరికొకరు చెప్పుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు. జడ్పీ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో కంప్యూటర్, పోడియం, టేబుళ్లు, ఎలక్ట్రికల్ బెల్, హెచ్ఎం ఛైర్, వైర్‌లెస్ మౌత్‌ను అందించారు. నీటి శుద్ధీకరణ యంత్రానికి మరమ్మతు చేయించారు. తమతో కలిసి చదువుకొని మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.28 వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు.

కాటమయ్య రక్షణ కవచాలపై శిక్షణ


రక్షణ కవచాలపై శిక్షణ పొందుతున్న గీత కార్మికులు

భూపాలపల్లి రూరల్, న్యూస్‌టుడే: భద్రతతో కూడిన రక్షణ కవచాలతో గీత కార్మికులు తాటిచెట్లను ఎక్కాలని తెలంగాణ గౌడసంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీపతి ప్రభాకర్ గౌడ్ అన్నారు. రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు పల్లె లక్ష్మణరావుగౌడ్ ఆదేశాల మేరకు ఆదివారం కొత్తపల్లి ఎస్ఎం సమీపంలోని సోలిపేట తాటి వనంలో గీత కార్మికులకు రక్షణ కవచాలను అందించి వాటి వినియోగంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై రబ్బాని, కల్లు గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తిని శివశంకర్‌గౌడ్, సాంబయ్య గౌడ్, రామచందర్ గౌడ్, నరేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సద్దుల బతుకమ్మ ఏర్పాట్లు


రేపాకలో ట్రాక్టర్‌తో నేలను చదును చేస్తున్న జీపీ సిబ్బంది

రేగొండ, న్యూస్‌టుడే: రేగొండ, కొత్తపల్లిగోరి మండల కేంద్రాలతోపాటు గ్రామాల్లో సద్దుల బతుకమ్మ పండగ ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఆయా గ్రామాల్లో బతుకమ్మ ఆడే చెరువుల కట్టలు, ఆలయాలు, పాఠశాలల ఆవరణ వంటి ప్రాంతాలను జీపీ సిబ్బంది ట్రాక్టర్లు, కూలీల సాయంతో చదును చేసే పనులను ప్రారంభించారు. గ్రామాల్లో నేలను చదును చేయుట, చెత్తాచెదారం, పిచ్చి మొక్కల తొలగింపు వంటి పనులు ఒకటి, రెండు రోజుల్లో పూర్తి స్థాయిలో అవుతాయని ఇన్‌ఛార్జి ఎంపీడీవో రాంప్రసాద్ ఆదివారం తెలిపారు. రాత్రి పూట మహిళలకు ఇబ్బందులు తలెత్తకుండా గ్రామాల్లో కాలిపోయిన వీధి దీపాలను తొలగించి కొత్తవి బిగించే కార్యక్రమం కూడా కొనసాగుతుందన్నారు. బతుకమ్మ ఆడే స్థలాల్లో కూడా విద్యుత్తు దీపాల బిగించే పనులు మరో రెండు రోజుల్లో మొదలు పెట్టనున్నట్లు ఇన్‌ఛార్జి ఎంపీడీవో చెప్పారు.

మంత్రి మాతృమూర్తి ప్రత్యేక పూజలు


ఆశీర్వాదం అందజేస్తున్న అర్చకులు

కాళేశ్వరం, న్యూస్‌టుడే: కాళేశ్వర క్షేత్రంలో ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు మాతృమూర్తి జయమ్మ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమె శ్రీపాద ట్రస్టు ఛైర్మన్ శ్రీనుబాబు సతీమణితో కలిసి రాగా ఆలయ అర్చకులు మర్యాదపూర్వక స్వాగతం పలికారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుభానంద ఆలయంలో అర్చకులు వారికి వేద ఆశీర్వచనం అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు ప్రభుత్వం అండ


లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే

చిట్యాల, న్యూస్‌టుడే: అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలవడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తున్నట్లు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ఆదివారం చిట్యాలలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గూట్ల తిరుపతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చిట్యాల, టేకుమట్ల, మొగుళ్లపల్లి మండలాల్లోని వివిధ గ్రామాల లబ్ధిదారులకు ఆయన సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. మొత్తం 77 మందికి రూ.26.7 లక్షల విలువైన చెక్కులను అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద ప్రజలను ఆర్థికంగా ఆదుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఖరీదైన వైద్య చికిత్స తీసుకోలేని, ఆర్థికంగా చితికిపోయిన కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఒక వరంలాంటిదన్నారు. మానవతా దృక్పథంతో దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ సీఎం రేవంత్‌రెడ్డి సాయాన్ని మంజూరు చేస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో రాంనర్సింహారెడ్డి, చిట్యాల ఏఎంసీ ఛైర్‌పర్సన్ గుమ్మడి శ్రీదేవి, జిల్లా ప్రధాన కార్యదర్శి మధు వంశీకృష్ణ, మండల పార్టీ అధ్యక్షులు సతీశ్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఓసీపీ-I ప్రాజెక్టు విస్తరణపై అధ్యయనం

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి ఆర్జీ-3 డివిజన్‌లోని ఓసీపీ-1 ప్రాజెక్టును ఆదివారం భారత బొగ్గు గనుల భద్రత విభాగం అధికారి రాజీవ్ ఓంప్రకాశ్‌వర్మ సందర్శించారు. మొదట ప్రాజెక్టు అధికారి రాధాకృష్ణ ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఓసీపీ-1 ప్రాజెక్టు విస్తరణకు వీలైన అంశాలపై రాజీవ్ ఓంప్రకాశ్ అధ్యయనం చేశారు. వ్యూపాయింట్ వద్దకు చేరుకొని ప్రాజెక్టు విస్తరిస్తున్న దిశ.. ఉద్యోగుల సంఖ్య అందుబాటులో ఉన్న యంత్రాలు, పర్యావరణ పరిరక్షణకు అధికారులు తీసుకుంటున్న జాగ్రత్తలు, సింగరేణి ఆధీనంలో ఉన్న స్థలం తదితర అంశాలను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు.

పోరాట యోధుడు సారంగపాణి

ఖిలావరంగల్, న్యూస్‌టుడే: ప్రజా, కార్మిక వర్గ పోరాటాలకు నాయకత్వం వహించి, అన్ని వర్గాల ప్రజలను ఐక్యం చేసిన నాయకుడిగా పేరున్న సారంగపాణి ఆశయాలను కొనసాగించాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి. రాములు పేర్కొన్నారు. ఆదివారం ఖిలా వరంగల్ పడమరకోటలో సీపీఎం నాయకుడు సుతారి సారంగపాణి సంస్మరణ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. మిల్లులో గుమాస్తాగా పనిచేసిన ఆయన నగరంలోని కార్మికుల పక్షాన ఉద్యమ పోరాటాలు చేశారన్నారు. నాయకులు వాసుదేవరెడ్డి, రంగయ్య, నలిగంటి రత్నమాల, పల్లం రవి, గడ్డం రమేశ్, సాగర్ల శ్రీనివాస్, కార్పొరేటర్ బైరబోయిన ఉమ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తీగల జీవన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చోరీకి గురైన చరవాణి అప్పగింత

చిట్యాల, న్యూస్‌టుడే: చోరీకి గురైన చరవాణిని చిట్యాల పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా కనుగొని బాధితుడికి అప్పగించారు. ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపిన ప్రకారం.. గిద్దెముత్తారం గ్రామానికి చెందిన కట్ట సారయ్య తన కిరాణా దుకాణంలో పనిచేస్తూ ఉండగా గుర్తు తెలియని వ్యక్తులు ఆయన చరవాణిని దొంగిలించారు. ఈ విషయంపై బాధితుడు స్థానిక ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా దర్యాప్తు చేసి చరవాణిని కనుగొని ఆదివారం బాధితుడికి అప్పగించారు. చరవాణి కనుగొనడంలో కీలకపాత్ర పోషించిన కానిస్టేబుళ్లు కోమల, మమత, లాల్‌సింగ్‌లను ఎస్సై అభినందించారు.

బాలుడి అదృశ్యంపై కేసు నమోదు

కొత్తపల్లిగోరి (రేగొండ), న్యూస్‌టుడే: చిన్నకొడపాక గ్రామానికి బొట్ల భువన దత్త(15) బాలుడు అదృశ్యంపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎన్ సందీప్‌కుమార్ తెలిపారు. బాలుడు ఈనెల 5న మిత్రుడికి ఇంటికి వెళ్లి వస్తానని తండ్రికి చెప్పి బయటకు వెళ్లి సాయంత్రం వరకు ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు రెండు రోజులుగా బంధువులు ఇళ్లు, చుట్టుపక్కల గ్రామాల్లో ఆరా తీయగా ఎక్కడా ఆచూకీ కనిపించలేదు. తండ్రి రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

భూపాలపల్లి, న్యూస్‌టుడే: భూపాలపల్లిలోని జయశంకర్ విగ్రహం వద్ద ఆదివారం ద్విచక్ర వాహనంపై వెళుతున్న వ్యక్తిని లారీ ఢీ కొట్టడంతో ఒకరు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం భూపాలపల్లి పట్టణానికి చెందిన శ్రీనివాస్ అనే వ్యక్తి తన ద్విచక్రవాహనంపై జయశంకర్ విగ్రహం వద్ద యూటర్న్ తీసుకుంటున్న సమయంలో పరకాల వైపు వెళుతున్న లారీ ఢీ కొట్టింది. ద్విచక్ర వాహనం పూర్తిగా ధ్వంసం కాగా శ్రీనివాస్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే లారీ డ్రైవర్ పరారయ్యాడు. స్థానికులు శ్రీనివాస్‌ను ఆసుపత్రికి తరలించి పోలీసులకు సమాచారం అందించారు.

బంగారు ఆభరణాలు మాయం

కరీంనగర్ నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సులో సిరిసిల్ల నుంచి కరీంనగర్ వచ్చే క్రమంలో ఓ ప్రయాణికురాలి సంచిలో ఉన్న 10 తులాల బంగారు ఆభరణాలు మాయమయ్యాయి. ఎస్సై భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండలానికి చెందిన బి.త్రివేణి భర్త సిరిసిల్ల జిల్లా కొనరావుపేట మండలంలో జూనియర్ కళాశాలలో అధ్యాపకుడిగా పని చేస్తున్నారు. వారు అక్కడే నివాసముంటున్నారు. దసరా సెలవుల్లో త్రివేణి ఆదివారం ఉదయం కొనరావుపేట నుంచి సిరిసిల్ల బస్టాండ్‌కు వచ్చింది. అక్కడి నుంచి బస్సులో మధ్యాహ్నం కరీంనగర్‌కు చేరుకుంది. తన బ్యాగు తెరిచి చూడగా ఆభరణాలు కనిపించలేదు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఒకటో ఠాణా పోలీసులు కేసు నమోదు చేశారు.

సింగరేణి కార్మికుడికి బహుజన సాహిత్య అకాడమీ అవార్డు

భూపాలపల్లి, న్యూస్‌టుడే: భూపాలపల్లి సింగరేణి కార్మికుడు, దుర్గామాత ఆలయ కమిటీ ఛైర్మన్ పల్లవిని స్వామిముదిరాజ్‌కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరుపతిలో బహుజన సాహిత్య అకాడమీ అవార్డు అందుకున్నారు. నేషనల్ ఛైర్మన్, సినీ డైరెక్టర్ ప్రేమ్‌రాజ్, కడప రిటైర్డ్ ఐపీఎస్ స్వామి, సౌత్ ఇండియా నేషనల్ కాన్ఫరెన్స్ కార్యదర్శి విష్ణువర్ధన్, పలు రాష్ట్రాల ప్రతినిధుల సమక్షంలో అవార్డు అందుకున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మహదేవపూర్, న్యూస్‌టుడే : జయశంకర్ భూపాలపల్లి జిల్లా న్యాయస్థానంలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి కుటుంబ సభ్యురాలు మృతిచెందడంతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.నారాయణబాబు ఆదివారం పరామర్శించారు. సూరారం గ్రామంలో వారి ఇంటికి చేరుకొని కుటుంబసభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన ఇసుక లారీ

మహదేవపూర్, న్యూస్‌టుడే: మహదేవపూర్- కాళేశ్వరం రహదారి మార్గంలో కుదురుపల్లి వంతెన సమీపంలో ఆర్టీసీ బస్సును ఓ ఇసుక లారీ ఢీకొట్టింది. కాళేశ్వరం వైపు వెళుతున్న బస్సును, మహదేవపూర్ వైపు వస్తున్న ఇసుక లారీ ఢీకొట్టింది. బస్సు వెనక భాగం స్వల్పంగా దెబ్బతింది. బస్సులోని ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాలేదు. ఒక్కసారిగా ఢీకొనడంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

టేకుమట్ల, న్యూస్‌టుడే: వెంకట్రావ్‌పల్లికి చెందిన పొన్నం మల్లయ్య అనే గీత కార్మికుడు రోడ్డు ప్రమాదంలో ఇటీవల మృతి చెందారు. ఆదివారం గౌడ సంక్షేమ సంఘం మండల గౌరవ అధ్యక్షుడు నేరెళ్ల రామకృష్ణగౌడ్, నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి, రూ.10వేలు అందజేశారు

30న నరకాసుర వధ ఉత్సవాలు


మాట్లాడుతున్న నరకాసుర వధ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మరుపల్ల రవి

కరీమాబాద్, న్యూస్‌టుడే: వేదపండితుల సూచన మేరకు ఈ నెల 30న రంగలీలా మైదానంలో నరకాసుర వధ ఉత్సవాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మరుపల్ల రవి తెలిపారు. ఆదివారం ఉర్సులో నిర్వహించిన ఉత్సవ కమిటీ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్సవాల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్ల కోసం మంత్రి కొండా సురేఖ, నగర మేయర్ సుధారాణి, పోలీసు కమిషనర్, బల్దియా కమిషనర్లను కలిసి వినతిపత్రాలు ఇవ్వాలని తీర్మానించినట్లు వివరించారు. ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి శతపతి శ్యామలారావు, కోశాధికారి కనుకుంట్ల రవి, సహాయ కార్యదర్శి అవునూరి రామ్మూర్తి, ప్రచార కార్యదర్శి మరుపల్ల గౌతమ్, కార్యవర్గ సభ్యులు దూడే కొమురెల్లి, మరుపల్ల శివ, అంకం రామనాథం, తౌటం నర్సింహ, కొమ్ము రాజు, పోలం రంజిత్, మంద పవన్ పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల ఐక్యతకు పాటుపడాలి


ఆర్యవైశ్య మహాసభ వరంగల్ జిల్లా నూతన కమిటీ ప్రతినిధులతో ప్రమాణం చేయిస్తున్న రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మీనారాయణ

రామన్నపేట, న్యూస్‌టుడే: ఆర్యవైశ్య మహాసభకు 120 సంవత్సరాల చరిత్ర ఉందని, రాష్ట్రంలో రెండు లక్షల పైచిలుకు సభ్యత్వాలు ఉన్నాయని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షులు అమరావతి లక్ష్మీనారాయణ తెలిపారు. ఆదివారం హంటర్‌రోడ్‌లోని ఓ వేడుకల మందిరంలో ఆర్యవైశ్య మహాసభ వరంగల్ జిల్లా నూతన కమిటీ అధ్యక్షుడిగా దుబ్బ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గార్లపాటిగా నాగేంద్రబాబు, కోశాధికారిగా శ్రీనివాస్ గుప్తాతో పాటు 250 మంది ప్రతినిధులతో ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. తెలంగాణలో ఇప్పటికే 28 జిల్లాలో కమిటీలు వేశామని, త్వరలోనే మిగిలినవి వేస్తామన్నారు. జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోనే వరంగల్ జిల్లా కమిటీ ఉత్తమంగా పనిచేస్తుందని, సేవా కార్యక్రమాల్లో ముందంజలో ఉన్నామని వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రేణిగుంట గణేష్ గుప్తా, కొండ్ల మల్లికార్జున్, రామకృష్ణ, ఉప్పుల శారద సుష్మా, చింతల రవి, శ్రీనివాస్‌తో పాటు అన్ని విభాగాల కమిటీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సీబీఐ అధికారినంటూ రూ.28.50 లక్షల టోకరా

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: హనుమకొండ నగరంలో ప్రముఖ పారిశ్రామిక వేత్తకు సీబీఐ అధికారుల మంటూ సైబర్ నేరగాళ్లు రూ.28.50 లక్షలు టోకరా వేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 2న పారిశ్రామిక వేత్తకు గుర్తు తెలియని మహిళ ఫోన్ చేశారు. ట్రాయ్ నుంచి మాట్లాడుతున్నామని, మీ ఆధార్‌కార్డు మొబైల్‌కు లింక్ చేయలేదని చెప్పారు. రెండు గంటల్లో ఫోన్ నెంబర్ బ్లాక్ చేస్తామని, త్వరలో మా ఉన్నతాధికారులు మీతో మాట్లాడతారని చెప్పి ఫోన్ పెట్టేశారు. కొద్దిసేపటి తర్వాత మరో మహిళ ఫోన్ చేసి తాను సీబీఐ ముంబయి బ్రాంచి అధికారినంటూ పరిచయం చేసుకున్నారు. తర్వాత వాట్సప్ వీడియోకాల్ చేసి సీబీఐ కార్యాలయం మాదిరిగా ఉన్న సెట్టింగ్‌ను చూపారు. మీరు మనీ ల్యాండరింగ్‌లో పాల్గొన్నారని, మీపై సీబీఐ కేసు నమోదు చేసిందని చెప్పారు. ఎప్పుడైనా మీ వద్దకు వచ్చి మా అధికారులు అరెస్టు చేస్తారని భయాందోళనకు గురిచేశారు. నరేష్ గోయల్ అనే వ్యక్తి మీ ద్వారా సుమారు రూ.6.8 కోట్లు మనీ ల్యాండరింగ్ చేశారని, అందుకోసం మీకు రూ.18.16 లక్షల కమీషన్ ఇచ్చారని చెబుతూ. . పూర్తి వివరాలు మా వద్ద ఉన్నాయని, ఈ కేసు నుంచి మీరు తప్పించుకోలేరని బెదిరించారు. ప్రస్తుతం మీ బ్యాంకు ఖాతాలో ఉన్న డబ్బు మేం సూచించిన ఖాతాలోకి మళ్లించాలని, కేసు విచారణ పూర్తయ్యాక ఎన్‌వోసీ ధ్రువీకరణతో పాటు మీ డబ్బు అప్పగిస్తామని నమ్మించారు. వారి మాటలకు భయపడిన పారిశ్రామిక వేత్త తనకు ఉన్న రెండు బ్యాంకు ఖాతాల నుంచి రూ.28.50 లక్షలు వారు చెప్పిన ఖాతాలోకి మళ్లించారు. రెండ్రోజుల తర్వాత అవతలి వ్యక్తుల నెంబరుకు ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. అనుమానం వచ్చి పారిశ్రామిక వేత్త పోలీసులను ఆశ్రయించడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. రంగంలోకి దిగిన పోలీసులు బాధితుడి నుంచి ఫిర్యాదు చేసుకొని కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

క్రికెట్ పోటీలో అధికారుల జట్టు విజయం

గోదావరిఖని, న్యూస్‌టుడే: స్థానిక సింగరేణి జవహర్‌లాల్‌నెహ్రూ క్రీడా మైదానంలో ఆదివారం నిర్వహించిన స్నేహపూర్వక క్రికెట్ పోటీలో అధికారుల జట్టు విజయం సాధించింది. సింగరేణి, ప్రెస్‌క్లబ్ జట్ల మధ్య స్నేహపూర్వక క్రికెట్ పోటీ ఏర్పాటు చేశారు. ఈ పోటీలను ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్ ప్రారంభించారు. గెలుపొందిన జట్టుకు ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ కప్పును అందజేశారు.